www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 27 డిసెంబర్ 2022

14 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు : డిపిఒ

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఈనెల 26 నుంచి జనవరి 14 వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నామని జిల్లా పంచాయతీ అధికారిని ఎం.ధనలక్ష్మి తెలిపారు. కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చి దిద్దుతామని చెప్పారు. పారిశుధ్యం లోపించి నీరు కలుషితం కావడం వల్ల అనేక రకాలైన అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదముందని తెలిపారు. అందుకే పారిశుధ్యానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోజూ ఒక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందులో ముఖ్యంగా గ్రామాలలో చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు తొలగించడం, మురుగు కాలువలందు పూడిక తీయించడం, గ్రామాలలో గుంతలు పూడ్చడం, వాడుకలోలేని బావులు గుర్తించి పూడ్చివేయడం, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టడం, డ్రై డే పాటించడం, కరోనా నివారణకు చర్యలు తీసుకోవడం, తాగునీటి ట్యాంకులను శుభ్రపరచడం, సున్నం, బ్లీచింగ్ పౌడర్ మిశ్రమాన్ని అపరిశుభ్రమైన చోట చల్లించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

కరోనా నివారణకు ముందస్తు చర్యలు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

చైనాలో కోవిడ్-19 విజృంభిస్తున్న నేపథ్యంలో ఆస్పత్రుల్లో వైద్యం అందించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుని, ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ గిరీష వైద్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ విసి హాల్‌లో కోవిడ్‌పై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై వైద్య సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, అప్రమత్తంగా ఉండాలని కోవిడ్ నివారణకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. కోవిడ్ రోగుల అడ్మిషన్స్ పెరిగితే బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు సరిపడ ఐసియు బెడ్లు, నాన్ ఐసియు బెడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు చర్యలు తీసుకోవాలని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా గతంలో కోవిడ్ ఆసుపత్రులుగా గుర్తించిన అన్ని ఆస్పత్రుల్లో బెడ్స్, ఆక్సిజన్, మ్యాన్ పవర్ సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎన్ని పిఎస్‌ఎ ప్లాంట్లున్నాయి, సిద్ధంగా ఉన్నాయా లేవా అని ఒకసారి సరి చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మాస్కులు, శానిటైజర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, డీటైప్ సిలెండర్లు, మందులు తగినన్ని నిల్వ ఉంచుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. టెస్టింగ్, వాక్సినేషన్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. రేపటి రోజు ప్రక్రియలపై మాక్ డ్రిల్ నిర్వహించాలని, ఏమైనా లేకపోతే వాటిని సమకూర్చుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సిహెచ్‌సిలో ఐదు ఐసోలేషన్ బెడ్లు ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అన్నమయ్య జిల్లా ఏర్పడిప్పటి నుండి భూకబ్జాలు ఎక్కువయ్యాయని సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో రాయచోటి, మదనపల్లి, రాజంపేట, ఓబులవారిపల్లి, కోడూరు, పీలేరు, కలికిరి, పెద్దమండ్యం, గుర్రంకొండ తదితర మండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా దొంగ పట్టాలతో భూములు కాజేస్తున్నారనే ప్రచారం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ భూములు, దళితులకు పంచిన భూములను కూడా వదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఇంటి స్థలాలు, వ్యవసాయ భూములు ఆక్రమించుకోవడం, ఎదురు తిరిగిన వారిపై దాడులు చేయడం పరిపాటిగా మారిందని వాపోయారు. పేదలకు, భూ బాధితులకు అండగా నిలవాల్సిన పోలీసులు, రెవెన్యూ అధికారులు న్యాయం చేయక పోగా, వారిపైనే కేసులు పెట్టడం, ఆఫీసుల చుట్టూ తిప్పుకోవడం తప్ప న్యాయం చేయలేదని వాపోయారు. చాలా చోట్ల పేదల అనుభవంలో ఉన్న భూములను రాజకీయ, ఆర్థిక అండదండలు ఉన్నవారికి అధికారులే కట్టబెడుతున్నారని అన్నారు. రాజకీయ నాయకులు, అధికారులు కుమ్మక్కై భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో భూ ఆక్రమణల నిగ్గు తేల్చాలని అందుకోసం జాయింట్ కలెక్టర్ నాయకత్వంలో కమిటీ వేసి సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాలకు, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిని శిక్షించాలని లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, నాయకులు డి.సి.వెంకటయ్య, ఎస్.రామచంద్ర, ఓబులేసు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

బరిపై టిడిపి మాజీల గురి!

- ఉమ్మడి జిల్లాలో నాలుగింట్లో సై
- మైదుకూరు అసెంబ్లీ బరిలో డిఎల్?

ఉమ్మడి కడప జిల్లాలో టిడిపి తరుపున బరిలో దిగేందుకు మాజీ ఎమ్మెల్యేలు రంగం సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల బరిలో దిగేందుకు మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురం, రాయచోటి అసెంబ్లీలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు టిడిపి టికెట్లు దక్కించుకుని అమీతుమీ తేల్చుకునే ఆలోచనల్లో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇటీవల మైదుకూరుకు చెందిన మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి అధికార వైసిపి సంక్షేమ పథకాలను లక్ష్యంగా విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మిగిలిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు టిడిపి టికెట్ తమకే వస్తుందనే వార్తలను ప్రచారం పెట్టడం తెలిసిందే. ఏదేమైనా మాజీ ఎమ్మెల్యేలు టిడిపి టికెట్లు దక్కించుకుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారుతుందనే వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో పది అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికలకు 16 నెలలు గడువు ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల వాతావరణం నెలకొంది. గత ఎన్నికల సమయంలో నిరాదరణకు గురైన మాజీ ఎమ్మెల్యేలు డిఎల్ రవీంద్రారెడ్డి, వరద రాజులరెడ్డి, వీరశివారెడ్డి, ద్వారకానాథరెడ్డి ప్రతిపక్ష టిడిపి టికెట్ దక్కించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల డిఎల్ రవీంద్రారెడ్డి ప్రధాన పార్టీల తరుపున పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కమలాపురం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి సైతం టికెట్ లభించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతు ఒడడం ఆసక్తికరంగా మారింది. ఇదే తరహాలో ప్రొద్దుటూరు బరిలో నిలిచేందుకు టిడిపి తరుపున లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్, వరదరాజులరెడ్డి క్యూలో ఉన్న సంగతి తెలిసిందే. వీరిలో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి టికెట్ ఇస్తే గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. రాయచోటి ప్రాంతానికి చెందిన గడికోట ద్వారకనాథరెడ్డి సైతం నేను సైతం పోటీ ఉన్నాననే సంకేతాలు ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అధికార వైసిపి తరుపున ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇస్తామనే ఆశ చివర్లో అడియాశకు గురి చేసిన సంగతి తెలిసిందే.

గడప గడపతో ఆశావహుల ఆశలు గల్లంతు!

అధికార వైసిపిలో సిట్టింగుల్లో అత్యధికులు గడపగడపకూ మనప్రభుత్వం సర్వేలతో ఒక్క రాజంపేట మినహా పరిస్థితులను మెరుగుపరుచుకున్నట్లు సమాచారం. అధికార వైసిపి తరుపున టికెట్లు ఆశించే ఆశావహుల్లో ఆశలు సన్నగిల్లినట్లు అంచనాలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతి లపక్ష టిడిపి తరుపున గట్టి ప్రత్యర్థులు కరువు కావడం ఆశావహులకు కలిసొచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. రాజకీయ అనుభవం, ఎన్నికల నిర్వహణలో ఆరి తేరిన మాజీలకు టికెట్లు లభిస్తే అధికార వైసిపి గట్టి పోటీని ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయనే వాదనలు వినిపిస్తుండడం గమనార్హం.

ప్రొఫెషనలిస్టుల దిశానిర్దేశాలు కలిసొచ్చేనా

మాజీ ఎమ్మెల్యేల ఆర్థిక, అంగ, సామాజిక నేపథ్యాలకు తోడు పొలిటికల్ ప్రొఫెషనలిస్టుల సర్వేలు, అంచనాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆసక్తికర పోటీ వాతావరణం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపి ప్రొఫెషనలిస్టుల సహాయంతో కమలాపురంలో 22,500 నుంచి జమ్మలమడుగులో 55,000 వేల ఓట్ల మెజార్టీలతో క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. పైన పేర్కొన్న నాలుగు స్థానాల్లో మైదుకూరు, కమలాపురం స్థానాల్లో గెలుపు అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు వ్యక్తమవుతుండడం ఆసక్తికరంగా మారింది. మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ పంచాయతీ ఎన్నికల దగ్గర నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు గట్టి పోటీనిచ్చే అధికార వైసిపిని ముప్పుతిప్పలు పెట్టిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో పుట్టా, డిఎల్ మధ్య రాజీ కుదిరించగలిగితే గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉందని చెప్పవచ్చు. కమలాపురం నియోజకవర్గ టికెట్ విషయాన్ని పరిశీలిస్తే వరుసగా రెండు సార్లు ఓడిపోయిన అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశాలు లేవనే పార్టీ వర్గాల సమాచారం ప్రకారం వెళ్తే వీరశివారెడ్డికి టికెట్ లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తిరుగుబాటు బెడదను అధిగమిస్తే గెలుపు అవకాశాల లోగిళ్లలోనికి చేరుకునే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

విభిన్నప్రతిభావంతునికి చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్, జెసి

ఆత్మస్థైర్యం నింపేందుకు కృషి

ప్రజాశక్తి - రాయచోటి

విభిన్న ప్రతిభావంతుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి వారు ఆర్థికంగా ముందుకు వెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ గిరీష పీఎస్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో కలెక్టర్ గిరీష పి ఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ, చేతుల మీదుగా విభిన్న ప్రతిభావంతులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులలో ఆత్మస్థైర్యం నింపి వారి కాళ్ళ మీద నిలబడే విధంగా ప్రభుత్వం వివిధ రకాలైన బ్యాంకు రుణాలు అందజేస్తోందని చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రుణాల ఇస్తోందని తెలిపారు. తీసుకున్న రుణాలను తిరిగి బ్యాంకులకు సక్రమంగా చెల్లించాలన్నారు. రుణాలు ఏ అవసరం కోసం తీసుకున్నారో వాటికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల రుణాలను జిల్లాలోని అర్హులైన విభిన్న ప్రతిభావంతులందరూ సద్వినియం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. నేషనల్ హ్యాండ్ క్యాప్డ్ ఫైనాన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌ఎఫ్‌డిసి) ద్వారా పీలేరు మండలం, రేగల్లు గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీకి రూ.5 లక్షలు, పీలేరు మండలం, ఎనుములవారిపల్లెకు చెందిన వై.మహేశ్వర్ రెడ్డికి రూ. 5 లక్షల చెక్కులను పాడి పరిశ్రమ కోసం కలెక్టర్ చెక్కులు అందజేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - రాయచోటి

యువత చెడు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రాజ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ఎన్‌ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిబ్బంది విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలు సేవించడం వల్ల అనారోగ్యానికి గురై బరువు తగ్గడం, ఆందోళనకు గురికావడం, ఏకాగ్రత కోల్పోవడం, ఆకలి మందగించడం, వంటి దుష్ప్రభావాలకు గురి అవుతారని వివరించారు . మత్తు పదార్థాలకు బానిసైన వారి కేంద్ర నాడీ మండల వ్యవస్థ అదుపుతప్పి అనారోగ్యానికి గురై ఆర్థికంగా, మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురై కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు అవుతున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజంలో మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాల వినియోగం వల్ల రోడ్డు ప్రమాదాలు, క్షణికావేశంలో తీసుకునే ప్రమాదకర నిర్ణయాలు వంటి వాటి వల్ల యువత భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మత్తుతో జీవితం చిత్తు అవుతుందని డ్రగ్స్ సేవించడం వల్ల నేరాలకు పాల్పడడం, స్నేహితులు, బాంధవ్యాలను మరిచి కుంగిపోయి ఆత్మహత్యలకు దారితీస్తుందని వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వివిధ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీధర రాజ్‌రెడ్డి

ఏం కష్టమొచ్చిందో..?

ఆ దంపతులకు ఏం కష్టమొచ్చిందో.. ముక్కుపచ్చలారని ఇద్దరి బిడ్డల్ని వదిలి చావుకు సిద్ధపడ్డారు. గుడికి వెళ్లి వస్తామని చెప్పి ఇంటి నుంచి బయలు దేరిన భార్యభర్తలు మైలవరం జలాశయంలోదూకి ఆత్మహత్య చేసుకున్నారు. తమ తల్లిదండ్రులకు ఏమైందో తెలియని చిన్నారులు వెక్కివెక్కి ఏడ్చారు. చిన్నారులను చూసి పలువురు కంట తడి పెట్టిన విషాద సంఘటన మైలవరం మండలంలో చోటు చేసుకుంది.

- మైలవరం జలాశయంలో దూకి దంపతుల ఆత్మహత్య
- ఆరోగ్య సమస్యలే కారణమా..?
- అనాథలైన ఇద్దరు చిన్నారులు

మృతిచెందిన వరలక్ష్మి, గోవర్ధన్

ప్రజాశక్తి - మైలవరం (కడప జిల్లా)

ఇద్దరు బిడ్డలను కట్టపై వదిలి భార్యాభర్తలు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన సోమవారం మైలవరం జలాశయ వద్ద చోటు చేసుకుంది. తల్లిదండ్రులు నీటిలో దూకడంతో ఏమి చేయాలో పాలుపోని చిన్నారులిద్దరూ ఏడుస్తూ స్థానికులకు కనిపించారు. వారు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. వివరాలలోకి వెళితే... మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన పల్లా గోవర్ధన్(34) పక్క గ్రామమైన దొమ్మర నంద్యాలకు చెందిన వరలక్ష్మి(32) ఐదేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల వైష్ణవ శ్రీసాయి, ఒకటిన్నర సంవత్సరాల హిమకర శ్రీసాయి కుమారులు. గోవర్ధన్ కడప నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో అకౌం టెంట్‌గా పనిచేస్తున్నారు. కడపలోనే నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం మైలవరం జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సం ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దంపతుల కోసం గజ ఈతగాళ్లతో వెతికించారు. తొలుత వరలక్ష్మి మృతదేహం లభ్యమైంది. మధ్యాహ్నం తర్వాత గోవర్ధన్ మృతదేహం లభ్యమైంది. తల్లిదండ్రుల మృతదేహాలను చూసిన అభంశుభం తెలియని చిన్నారులు ఏడ్పులను చూసిన వారు కూడా కంటతడి పెట్టారు. ముక్కు పచ్చలారని పిల్లలను వదిలేసి ఆ తల్లిదండ్రులు ఆత్మహత్య ఎలా చేసుకోవాలనిపించందనే అక్కడికి వచ్చిన వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడు, కోడలు ఆత్మహత్య చేసుకున్నారన్న విషయం తెలుసుకున్న గోవర్ధన్ తల్లి లక్ష్మీదేవి సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. నాలుగు రోజుల క్రితమే గోవర్ధన్ వేపరాలకు వచ్చారని ఆమె చెప్పారు. తన ఆరోగ్యం సరిగా లేదని, బతకాలని కూడా లేదని చెప్పాడని ఆమె తెలిపారు. గుడికి వెళుతున్నామని తన భార్యబిడ్డలతో కలిసి వెళ్లాడన్నారు. మృతుని తల్లి లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఇద్దరి బిడ్డలతో దంపతులు (ఫైల్‌ఫోటో)

అనాథలైన చిన్నారులు..

తల్లిదండ్రులు చనిపోవడంతో అభంశుభం తెలియని చిన్నారులు అనాథలుగా మిగిలారు. అమ్మానాన్నలకు ఏమైందో తెలియని అమాయకపు చూపులు చూస్తున్న చిన్నారులకు ఇక నుంచి తమ ఆలనా పాలన చూసే వారెవరో తెలియని పరిస్థితి. అమ్మకోసం వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్నారులను చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

అమ్మకోసం ఏడుస్తున్న చిన్నారి

మెరుగైన వైద్య సేవలందించండి

- డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ వడ్డిపల్లి పాఠశాలలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని, తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఏ రోగిని రెఫర్ చేయకూడదన్నారు. గ్రామాల్లోనే ప్రతి చికిత్సకు వైద్యం అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారులకు హోం విజిట్ ఏయాలని, ప్రతి నెల గర్భిణీలను పరీక్షించి, ఐఎఫ్ఏ మందులను పంపిణీ చేయాలని సూచించారు. లెప్రసీ సర్వే, టిబి సస్పెక్ట్ ప్రతి రోజు పంపాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నయీమ్, మణిభూషన్, హెచ్ఇఒ సత్యనారాయణ, ఎంపిహెచ్ఈవో శ్రీనివాసులు, ఎంపిహెచ్‌ఎస్ మురళి, సిబ్బంది నాగిరెడ్డి, మౌనిక, ఎఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

క్రీడాజ్యోతి వెలిగిస్తున్న ఎజిఎం చెన్నకేశవరాజు

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని నారాయణ పాఠశాలలో సోమవారం రాజంపేట, రాయచోటి, కోడూరులో ఉన్న నారాయణ విద్యా సంస్థల క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎజిఎం చెన్నకేశవరాజు, ఆర్ఐ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి తోడ్పడతాయని వివరించారు. ఈ పోటీలలో మూడు బ్రాంచీల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారని గెలుపొందిన వారు ఈ నెల 28వ తేదీన కడపలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మూడు బ్రాంచీల ప్రిన్సిపల్ కె.గీత, అబ్దుల్ జమీర్, ఖాదర్ వలీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్, జెసి

'స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు'

ప్రజాశక్తి - రాయచోటి

స్పందన ఆర్జీలను నిర్లక్ష్యం చేయకుండా గడువు లోపల పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ తమిమ్ అన్సారీయ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజు, ప్రజల నుంచి వచ్చిన ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారు. అధికారులు బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. స్పందనలో ఎక్కువగా భూ సమస్యలు, పంచాయతీరాజ్ శాఖ, సివిల్ సప్లయిస్, డిపిఒ, పబ్లిక్ హెల్త్, తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు వస్తుంటాయని వీటిపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎలోకి వెళ్లకుండా నాణ్యతతో గడువు లోపల పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు వినతి పత్రాలు సమర్పించారు. ఈసమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌లో విద్యార్థులకు స్థానం

రాయచోటి టౌన్ : శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ఈనెల 25న నిర్వహించిన నృత్య పోటీలలో రాయచోటికి చెందిన డిజె డాన్స్ అకాడమీ విద్యార్థులు ధరణి, సంధ్య, హేమ చరణ్ తేజ్, నాగరాణి, కేతన, భాను ప్రకాష్, వరుణ్ పాల్గొని తెలుగు బుక్ ఆఫ్ రికార్డు లో స్థానం సంపాదించారు. విజేతలుగా నిలిచి కూచిపూడి నృత్య గురువుల చేతుల మీదుగా 2022 నాట్య గాంధర్వ అవార్డును, ప్రశంస పత్రాలు అందుకోని మొట్టమొదటిసారిగా నృత్య ప్రదర్శనలో పాల్గొని మొదటి బహుమతిని అందుకున్నారు.

అన్నదానం గొప్పది

రాయచోటి టౌన్: అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని వైసిపి మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమం అర్జీదారులకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి ప్రజలకు ఇక్కడికి వస్తుంటారని వారి ఆకలి తీర్చేందుకు అన్నదానం ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి సోమవారమూ అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫాయాజూర్ రహమాన్, కౌన్సిలర్లు, ఈశ్వర్ ప్రసాద్, నరసింహ రెడ్డి, వైసిపి నాయకులు పల్లపు రమేష్, సుగవసి శ్యామ్‌తో పాటు బేపారీ జబిబుల్లా, బేపారి అసద్ ఖాన్, కొత్తపల్లి ఇంతియాజ్, జావేద్, అమీర్, అజంతుల్లా, నాగేంద్ర పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న వైసిపి నాయకులు

హార్సిలీహిల్స్‌లో సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి కేశప్ప

హార్సిలీహిల్స్‌లో పటిష్టమైన ఏర్పాట్లు : డిఎస్‌పి

ప్రజాశక్తి-బి.కొత్తకోట:
నూతన సంవత్సరం 2023 వేడుకలను పురష్కరించుకొని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు మదనపల్లి డిఎస్‌పి కేశప్ప తెలిపారు. సోమవారం హార్సిలీ హిల్స్ లో పోలీస్‌అధికారులు, స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31 నుండి జనవరి ఒకటో తేదీ రాత్రి వరకు హార్సిలీహిల్స్‌పైకి ద్విచక్ర వాహనాలకు అనుమతి లేదని అన్నారు. ఈచర్లు, ఆటోలు, బొలెరో తదితర వాహనాలను కిందనే పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. అదేవిధంగా పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్‌టిసి అధికారులతో సంప్రదించడం జరిగిందని, దీంతో డిపో మేనేజర్ 25 బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లి డివిజన్ పరిధిలోని పర్యాటకులు, సుదూర ప్రాంతాల నుండి వచ్చే పర్యాటకులు బస్సులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మద్యాన్ని తీసుకెళ్లడానికి అనుమతులు లేవన్నారు. కొండపైనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేసు కోవాలని చెప్పారు. డీజె, ఓపెన్ ఎయిర్ మ్యూజిక్‌లకు అనుమతులు లేవన్నారు. కొండపై కూడా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యేక పార్కిం గులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో రూరల్ సిఐ శివాంజ నేయులు, తాలూకా సిఐ సత్యనారాయణ, బి.కొత్తకోట ఎస్.ఐ.రామ్మోహన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బి.కొత్తకోట
ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్ద తిప్ప సముద్రం పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రజలకి ఎటు వంటి ఇబ్బంది లేకుండా సంక్షేమ పథకాలు అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజల్ని ఇబ్బంది పడకుండా సకాలంలో వారికి సహాయ, సహకారాలు అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గిరిధర్‌రెడ్డి, ఎంపిపి మహమ్మద్, జడ్పిటిసి శివన్న, వైసిపి నియోజకవర్గ మహిళా కన్వీనర్ అనిత చక్రవర్తి, సర్పంచ్ శంకర, పద్మశాలి స్టేట్ డైరెక్టర్ సురేంద్ర, ఎంపిటిసి సయ్యద్, ఎస్ఎస్.ఫయాజ్, ఎంపిటిసి నాగార్జున రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ అయుబ్‌బాషా, సబ్జీ, పవన్, నక్కమహేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

నేడు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - బి.కొత్తకోట
బి.కొత్తకోట, పిటిఎం మండలాల్లో 8వతరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిచే ట్యాబ్‌లను పంపిణీ చేయనున్నారు. జిల్లాపరిషత్ బాలురఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ రంగనాథయ్య పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపిపి ముద్ద బాబుల్‌రెడ్డి, మండల జడ్పిటిసి ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులతల్లిదండ్రులు ఉపాధ్యాయులు, ప్రధానో పాధ్యాయులు, సచివాలయసిబ్బంది, పాల్గొనాలని కోరారు.

పాఠశాలకు నగదు విరాళం

ప్రజాశక్తి -పెద్దమండ్యం
మండలంలోని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి చంద్రశేఖర్‌నాయక్ పదివేల రూపాయలు అందించారు. పాఠశాలలో 1994-95 సంవత్సరంలో పదవతరగతి చదివానని, మా బ్యాచ్ లో చదివిన వారు అనేక రంగాలల్లో ఉన్నత స్థానలాల్లో వున్నారని అన్నారు. ఈ పాఠశాలలో చదివిన నేను వెలిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాని అన్నారు. నా వంతుగా రూ.10 వేలు విరాళన్ని అందిస్తునాన్ని అన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కురబలకోట
ఈ నెల 28న నిర్వహించే ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారతీయ అంబేద్కర్ సేన జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం అంగళ్లులో ప్రచార రథాన్ని ప్రారంభించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మారుతున్నటువంటి జీవన పరిస్థితులు, మద్యం, సిగరెట్ వంటి వ్యస నాలకు బానిసలై మరణాలకు చేరువ వుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ హృదయాలయ, నారాయణ హార్ట్ సెంటర్ వారిచే ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ మంజు నాథ్‌బాబుచే వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. బిపి, షుగర్, ఇసిజి, ఎకో వంటి పరీక్షలకు ఉచితంగా నిర్వహిస్తారని ఈయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్‌సేననాయకులు ఎరుకలప్ప, మైకరాజు, భాస్కర్, సుధీర్ పాల్గొన్నారు.

వైభవంగా జెర్రీ జెండా ఊరేగింపు

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లె రైల్వే ప్రాంగణంలో వెలసిన హజరత్ ఖాదరవల్లి దర్గా ఉరుసు మహోత్సవం సందర్భంగా జెర్రీ జెండాను షేక్ సలీంముజావర్ ఇంటి నుండి పకీర్ల డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా దర్గాకి చేరుకున్నారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ ప్రెసిడెంట్ షేక్ కమల్ భాష, జిల్లా వక్స్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్ మాట్లాడుతూ మతసామరస్యానికి ప్రతీకగా రైల్వే కేంద్రంలోని దర్గా నిలుస్తుందని, హిందూ ముస్లింలు ఐక్యంగా ఉరుసు ఉత్సవాలు జరుపు కుంటా రని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఖలీమ్, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

రామాపురం : మండలం లోని సరస్వతిపల్లి గ్రామానికి చెందిన రెడ్డయ్య అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు.ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరుచు కునేందుకు స్థానిక నాయకులు రూ.40 వేలు ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ మునీర్ భాష రూ.10 వేలు మైనార్టీ నాయలకుడు ఖాదరవల్లి, రూ.10వేలు, ఎంపిటిసి సూరం నాగభూషణమ్మ రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థికసాయంపై కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

NAME CHANGE
I, RAMISETTY MANJULA W/o THUMMAGINJALA VEERANJANEYA, R/of Plot No.118, Y.S.R COLONY, Ammacheruvu Mitta, Madanapalle P&M, Chittoor/ Annamaiah Dist, A.P., have changed my daughter's name from THUMMAGINJALA MANJULA VEERANJANEYA BHAVANA (Old Name) to THUMMAGINJALA DEEPTHI (New Name)

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-రామాపురం
కుమ్మరపల్లినీలకంఠ రావు పేట (తెలుగు) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 8వ తరగతి చదువుతున్న 48 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు కుమ్మరపల్లి సర్పంచ్ ముక్కోటి భారతి తెలిపారు. మండలం లోని కుమ్మరపల్లి, నీలకంఠరావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 8వ తరగతి విద్యార్థులకు సంబంధించిన ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమాని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన బైజుస్ సమస్త ద్వారా విద్యార్థులకు సులభమైన సరళమైన పద్ధతుల్లో విద్యాబోధన కార్యక్రమం నిర్వహించడం విద్యార్థులకు ఒక వరం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుజాత, శ్రీనివాసులు, విశ్రాంత విఆర్‌ఒ రామసు బ్బారెడ్డి ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్ విద్యార్థులు పాల్గొన్నారు. **చిన్నమండెం** :మండలంలోని మల్లూరు గ్రామంలో ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను మల్లూరు సర్పంచ్ దేవపట్ల నజీర్ భాషా చేతుల మీదుగా 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నజీర్ భాష మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం పంపిణీ చేసే ట్యాబ్‌లను విద్యార్థులు సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో ప్రధానో పాధ్యా యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ స్తులు పాల్గొన్నారు. **గాలివీడు :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యా ర్థులకు సర్పంచ్ మల్లికార్జున నాయుడు, ప్రధానోపా ధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి చిన్నపరెడ్డి, ఉపాధ్యాయులు జనార్దన్‌రాజు, నరేంద్ర, శివారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు. **సుండుపల్లె :** రాయవరం గ్రామం కుడుంవాండ్లపల్లిలో ఉన్న వైవైఆర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన 8వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ చేశారు. ప్రధా నోపాధ్యాయురాలు సుధారాణి, స్కూల్ చైర్మన్ బాబు అధ్య క్షతన స్కూల్ ఆవరణలో ట్యాబ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌షరీఫ్, ఉప సర్పంచ్ ఆకులశివ కుమార్, వైసిపి నాయకులు రహిమాన్ ఖాన్, సింగిల్ విండో ప్రెసిడెంట్ మధు రెడ్డి పాల్గొన్నారు.

గాలివీడు : ట్యాబ్‌లతో విద్యార్థులు

మల్లయ్య కొండపై అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ.5 కోట్లతో గదుల నిర్మాణం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి
ఎపి టూరిజంశాఖ ఆధ్వర్యంలో మల్లయ్య కొండపై అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి కృషితో హైదరాబాద్ వైల్డ్ లెఫ్ట్ రిసార్ట్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. సోమవారం టూరిజం డైరెక్టర్ భాస్కర్ రెడ్డి, వైల్డ్ లెఫ్ట్ రిసార్ట్ నిశ్చాంత్ డిటిఒ నాగభూషణం, కౌన్సిల్ మెంబర్ షాకీర్, డి ఎం రాజశేఖర్ రెడ్డి బృందం మల్లయ్య కొండను సందర్శించారు. ఆలయ చైర్మన్ కె.ఆర్. మల్‌రెడ్డి, ఇఒ మునిరాజులు వారికి స్వాగతం పలికారు. పూజారులు ఈశ్వరప్ప మల్లికార్జునలో స్వామివారికి పూజలు అభిషేకలు నిర్వహించి స్వామి దర్శనం కల్పించారు. అనంతరం టూరిజం అధికారుల కొండపై పలు స్థలాలను పరిశీలించారు. మొదటిగా రూ.5 కోట్లతో భక్తులకు సౌక ర్యంగా ఉండేలా అత్యాధునిక వసులతో 20 గదులు నిర్మిస్తామని తెలిపారు. రెండో విడతలో మరో20 గదులు నిర్మిస్తామని చెప్పారు. ఇంకా పలు రకాల సౌకర్యార్థం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిశ్చాంత్ తెలిపారు. వీరి వెంట తహాశీల్దార్ కళావతి, ఆర్ఐ రవి, ఆర్‌బికె చైర్మన్ రెడ్డి మల్ రెడ్డి, మైనుద్దీన్ పాల్గొన్నారు.

మల్లయ్య కొండపై స్థలాన్ని పరిశీలిస్తున్న వైల్డ్ లెఫ్ట్ రిసార్ట్ నిశ్చాంత్

ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి-గాలివీడు
మండలంలోని గోరాన్ చెరువు పంచాయతీ సర్వేనెంబర్ 890లో విస్తీర్ణం 95 సెంట్ల ప్రభుత్వ స్థలంలో సోమవారం తహశీల్దార్ దైవాదీనం ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు నాటారు. ప్రభుత్వ భూమి గనుక ఇందులో ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. ఆసర్వే నెంబర్లు వున్నా ప్రభుత్వ స్థలంవద్ద హెచ్చరికబోర్డును కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాన్ని ఎవరైనా అన్యాక్రాంతం చేయాలని ప్రయత్నిస్తే వారిపైన కేసులు పెడతామని అన్నారు. కార్యక్రమంలో విఆర్‌ఒ రవీందర్ రెడ్డి, విఆర్ఎ సిద్దేశ్వర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సికి ఇసిజి మిషన్ వితరణ

ప్రజాశక్తి-నందలూరు
మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.20లక్షలు విలువ చేసే ఇసిజి మిషన్ ను ఎస్‌టి ఖాన్, భాషాబేగంల కుమారులు మోయిన్ అహ్మదుల్లా ఖాన్, డాక్టర్ అసుదుల్లా ఖాన్, మండల కో-ఆప్షన్ నెంబర్ కలీం, ఏజిపి సెమీ ఉల్లా ఖాన్, ఎంపిపి మేడ విజయ భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వర్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, వైసీపీ నాయకులు నడివీధి సుధాకర్ , తుమ్మల శ్రీధర్ గౌడ్, బీసీ నాయకులు కొత్తపల్లి శేషయ్య,104 సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రామాపురం
మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వాలంటరీ పోస్టులకు అర్హులైన వారు ఈనెల 31 లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ హైదరవల్లి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగుట్టపల్లి ఓసి, బిసిజనరల్‌లకు, గోపుగుడుపల్లి బిసి ఉమెన్, రాచపల్లి ఓసి జనరల్ కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్హత 10 పాసై స్థానికంగా ఉండాలని అన్నారు. ఆన్లైన్ చేసుకున్న అభ్యర్థులు ఆ దరఖాస్తును ఎంపిడిఒ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

పిఎం కిసాన్‌కి 31 చివరి గడువు

ప్రజాశక్తి - పుల్లంపేట
పుల్లంపేట మండల పరిధిలోని పీఎం కిసాన్ పథకానికి అర్హులైన రైతులందరూ మీ దగ్గరలోని సిఎస్‌సి సెంటర్, మీసేవ, పిఎం కిసాన్ వెబ్సైట్లో ఇకెవైసి ఈనెల 31వ తేదీ లోపు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 5176 మంది రైతులకు గాను ఇప్పటివరకు 372 మంది రైతులు మాత్రమే ఈ కేవైసీ చేయించుకున్నారని మిగిలిన 2104 మంది రైతులు ఇకెవైసి చేయించుకోలేదని తెలియజేశారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఇకెవైసి పెండింగ్ ఉన్న రైతులు జాబితాను ఉంచామని తతెలిపారు. అర్హత ఉండి ఇకెవైసి చేయించుకొని రైతులకు 13వ విడత పిఎం కిసాన్ వారి బ్యాంకు ఖాతాలో జమ కాదని, ఏదైనా సమా చారం కోసం రైతు భరోసా కేంద్రం అధికారిని సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శ్రీభువన విద్యార్థులు

ప్రజాశక్తి-పీలేరు
స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(శాప్) ఆధ్వర్యంలో డిసెంబర్ 27న తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి యోగా లీగ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా స్థాయిలో గెలుపొందిన 8-12, 12-14 మధ్య వయస్సు విద్యార్థుల జాబితాలోని వారు రాష్ట్ర స్థాయి యోగా లీగ్ పోటీలలో పాల్గొనున్నారు. అందులో భాగంగా జిల్లా నుండి 16 మంది రాష్ట్ర స్థాయి యోగా లీగ్ పోటీలకు ఎంపిక కాగా, వారిలో పీలేరు పట్టణంలోని శ్రీ భువన విద్యాలయం నుంచే 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపి కలకు వెళ్ళడం విశేషం. ఈ సందర్భంగా శ్రీ భువన పాఠశాల వ్యవస్థాపకులు ఉమా రమా దేవి మాట్లాడుతూ తమ పాఠశాలలో విలువలతో కూడిన విద్యతోపాటు, యోగ, ధ్యానం, కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. "షి" దివ్య యోగ విద్యాలయ అధ్యక్షురాలు, అన్నమయ్య జిల్లా శాప్ యోగ కోచ్ డాక్టర్ పివిఎస్ లక్ష్మీ సుధాకర్ తమ పిల్లలకు యోగ, ధ్యానంలో మంచి శిక్షణ ఇవ్వడం ద్వారా జిల్లాలోనే అత్యధికంగా తమ పాఠశాల నుంచి 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా లీగ్ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని ఆమె తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అందుకు తమ విద్యార్థులకు తగిన శిక్షణ ఇచ్చిన డాక్టర్ పి.వీ.ఎస్ లక్ష్మీసుధాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి తేక్వాండోలో క్రీడాకారుల సత్తా

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్
జాతీయ స్థాయి తేక్వాండో పోటీలలో రాజంపేట క్రీడాకారులు సత్తా చాటారని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కడప జిల్లా కార్యదర్శి కొన్నిపాటి వెంకటేష్, కోచ్ సి.దామోదర్‌రాజు పేర్కొన్నారు. ఈ నెల 24, 25వ తేదీలలో ఒంగోలులోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన 25వ జాతీయ స్థాయి ఐటిఎఫ్ తేక్వాండో పోటీలలో రాజంపేటకు చెందిన వి.వరుణ్ కుమార్ రజతం, ఎం.యశ్వంత్, ఎం.అలంకృత కాంస్య పతకాలు సాధించారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సోమవారం క్రీడాకారులకు పతకాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అనంతరం మాస్టర్లు సునీల్, వెంకటేష్, దామోదర్ రాజు మాట్లాడుతూ రాజంపేట క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం హర్షనీయమన్నారు. విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేశాయని, విద్యార్థులు క్రీడలలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించిన మాస్టర్ దామోదర్ రాజును ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, సంయుక్త కార్యదర్శులు అద్దాల మణి ఉమాశంకర్, కె.నాగరాజ, కోశాధికారి అయ్యపురాజు చంద్ర, గౌరవ సలహాదారులు వర్ల నరసింహులు, టి.చంద్రశేఖర్, కె.గంగారామ్ ప్రత్యేకంగా అభినందించారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం
పెయ్యదూడల మాత్రమే పుట్టే (లింగ నిర్ధారిత వీర్యం) పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ నీరజ తెలిపారు. మండలంలోని వాల్మీకిపురం, చింతపర్తి, గండబోయనపల్లి, మంచూరు, నగిరిమడుగు, గుర్రంకొండ మండలంలోని అమిలేపల్లి, తరిగొండ, గుర్రంకొండ, మర్రిపాడు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని, పెయ్యదూడల పథకం ద్వారా పాడి రైతులు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. రూ.1350 ఖరీదు చేసే రెండు వీర్యనాశికలను ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.500లకు రైతులకు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి-వాల్మీకిపురం
మంగళవారం ఉదయం 9:30గంటలకు పట్టణంలోని తిరుపతి రోడ్డు, చాకలిబండ, హసన్‌ఖాన్‌వీధి, తిరుచుట్టువీధి, బజారువీధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో షబ్బీర్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి హాజరై ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని, పరిష్కార సమస్యలను అక్కడిక్కడే పరిష్కరిస్తారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

చలో కురబలకోట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్
భక్తకనకదాస 535వ జయంతి ముగింపు ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు ఒబిసి దక్షిణ భారతదేశ అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు డాక్టర్ రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆర్.కృయ్యలతోపాటు భారతదేశం నలుమూలల నుంచి కురుబ కులానికి చెందిన ప్రముఖులు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ కో-ఆర్డినేటర్ ఎన్.బి.హరీష్ పూజారప్ప, దత్త బాక్స్ వైస్ ప్రెసిడెంట్,మహారాష్ట్ర షఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ మంజునాథ్, మోక్షిత్ పాల్గొన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న అబ్దుల్‌ఖాదర్

పింఛన్ల తొలగింపుపై ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్
ఇటీవల ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల తనిఖీలలో అనేక మంది విభిన్నప్రతిభావంతుల పింఛన్లు తొలగించారని, ప్రభుత్వం వాటిని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ కోదండరామిరెడ్డికి విభిన్న ప్రతిభావంతుల సేవా సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు కేవలం ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ల మీదనే ఆధారపడి జీవిస్తుంటారని తెలిపారు. అలాంటి వారికి భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని కోరారు.

బస్టాండు ఆవరణంలో పార్కింగ్ చేసిన స్కూటర్లు

స్కూటర్ స్టాండ్‌ను తలపిస్తున్న ఆర్‌టిసి బస్టాండు

ప్రజాశక్తి- కలకడ
మండల కేంద్రమైన కలకడ ఆర్‌టిసి బస్టాండు స్కూటర్‌స్టాండ్‌ను తలపిస్తోంది. ప్రయాణికులు బస్టాండ్ లోనికి వెళ్లడానికి వీలు లేకుండా అడ్డంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నిలుపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నా ఆర్‌టిసి అధికారులు కంట్రోలర్‌ను నియమించ కపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. బస్టాండ్ ఆవరణంలో వ్యాపార సముదాయాలతో మెండుగా ఆదాయం ఉన్నప్పటికీ ప్రయాణికులకు మౌళిక వసతులు కల్పించ లేద న్నారు. బాత్రూములు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతు న్నామ ని స్థానికులు, ప్రయాణీకులు వాపోతున్నారు. బస్టాండ్ ఆవరణంలో కంట్రోలర్‌ను ఏర్పాటు చేస్తే స్కూటర్లు, ఆటోలు, ప్రైవేటు వాహనాలు లోనికి రాకుండా నిలుపుదల చేసేందుకు అవకాశాలున్నాయని చర్చించు కుంటున్నారు. ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్‌టిసి అధికారులు కంట్రోలర్‌ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఎంపీ మిథున్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న వైసిపి నాయకులు

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి-గుర్రంకొండ
గుర్రంకొండ మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎంపీ మిథున్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల కన్వీనర్ ముక్తియార్ అలీఖాన్, మండల ప్రత్యేక ఆహ్వానితులు యోగేంద్ర పలు సమస్యలను ఎంపీకి వివరించారు. మండల కేంద్రంలో బాత్రూంలో సౌకర్యం లేదని, గురు కుల పాఠశాల శాశ్వత భవనాన్ని ,క్రీడా స్టేడియం, వారపుసంతకొచ్చే యాభై గ్రామాల మహిళలకు అవసరమైన మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ఎంపీని కోరారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందుకు స్పందించిన ఎంపీమిథున్ రెడ్డి మండల అభివృద్ధి పనులతో పాటు ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపైన ప్రత్యేక దృష్టి సారి స్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సీతమ్మ , జడ్పిటిసి సమ్రీన్ ముక్తి యార్ అలీఖాన్, ఆర్‌బికె చైర్మన్ జయచంద్ర రెడ్డి, మాజీ ఎంపిపి నక్కా చంద్రశేఖర్, మైనింగ్ డైరెక్టర్ హరీష్ రెడ్డి, డైరెక్టర్ సాగర్, సుధీర్‌రెడ్డి, సుబ్బయ్య , డాక్టర్ పురుషోత్తంరెడ్డి, నాయని ఆదినారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-రామాపురం
కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం, బండపల్లి గ్రామం ఐరీష్ హోటల్ సమీపంలో సోమవారం తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్‌టిసి హెయిర్ బస్సు ఢీకొనడంతో మల్లేష్ (62) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోలీసుల వివరాలు మేరకు ముద్దనూరు మండలం పెనికిలపాడు గ్రామానికి చెందిన మల్లేష్ అనే వ్యక్తి తన కుమార్తె ఇంటికి పోత్తూరు పల్లెకు బస్సు దిగి వెళుతుండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న ఆర్‌టిసి హెయిర్ బస్ ఢీకొంది. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఐదు మంది కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారని అన్నారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగిం చినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్
పట్టణపరిధిలోని కడప రింగ్‌రోడ్డు వద్ద అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను సోమవారం సీజ్ చేసినట్లు అర్బన్ ఎస్ఐ యన్ ఎండి.రఫీ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు చిట్లూరు నుండి ఇసుకను అక్రమంగా రవాణాచేస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను, డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని పత్రాలను పరిశీలించి, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీసుల సీజ్ చేసిన ట్రాక్టర్

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ : ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దమండ్యం
మండలంలోని స్థానిక గ్రామం నందు పెద్దమండ్యం-గాలివీడు మార్గంలో చెరువు కట్టమీద ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో చెరువులోకి పడిపోయింది. ఆటోలోని వ్యక్తులు చెరువులో నుండి సురక్షితంగా స్థానికుల సహాయంతో బయట పడ్డారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహన దారుడు ఖధీర్ అనే వ్యక్తికి తలపైన స్వల్ప గాయం తగిలింది. చికిత్స నిమిత్తం పెద్దమండ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది ఎవరూ లేకపోవడంతో 108లో రాయచోటి చికిత్స కేంద్రానికి తరలించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి ద్విచక్ర వాహనాన్ని, ఆటో డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-కలికిరి
రోడ్డు ప్రమాదం లో కుక్కలొడ్డు వాసి మృతి చెందాడు. కలికిరి మండలంలోని పత్తేగడ గ్రామం, కుక్కలొడ్డు కు చెందిన శ్రీరాములు కుమారుడైన జయరాం (45) ఇటుక బట్టీలు వేసుకొని, వాటి వ్యాపారం చేసు కుంటూ జీవనం సాగించేవాడు. కుమారుడి చదువు నిమిత్తం, పీలేరు ఎంజెఆర్ కళాశాలలో ఫీజు కట్టి, తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతను అక్కడి కక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సదుం పోలీసులు కేసు నమోదు చేసి శవపరీక్ష నిమిత్తం పీలేరుకి తరలించినట్లు తెలిపారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కుటుంబ పెద్ద మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామంలో విషాదం అలుముకుంది.

ప్రమాదంలో మృతి చెందిన జయరాం

కడప అమీన్‌పీర్ దర్గాను బిగ్‌బాస్ ఫేమ్ సోహెల్ సోమవారం సందర్శించారు. దర్గా సంప్రదాయం ప్రకారం ముజవర్లు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గా విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.

బరిపై టిడిపి మాజీల గురి!

- ఉమ్మడి జిల్లాలో నాలుగింట్లో సై
- మైదుకూరు అసెంబ్లీ బరిలో డిఎల్?

ఉమ్మడి కడప జిల్లాలో టిడిపి తరుపున బరిలో దిగేందుకు మాజీ ఎమ్మెల్యేలు రంగం సిద్ధం చేసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల బరిలో దిగేందుకు మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురం, రాయచోటి అసెంబ్లీలకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు టిడిపి టికెట్లు దక్కించుకుని అమీతుమీ తేల్చుకునే ఆలోచనల్లో ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. ఇటీవల మైదుకూరుకు చెందిన మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి అధికార వైసిపి సంక్షేమ పథకాలను లక్ష్యంగా విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. ఇదే తరహాలో మిగిలిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు టిడిపి టికెట్ తమకే వస్తుందనే వార్తలను ప్రచారం పెట్టడం తెలిసిందే. ఏదేమైనా మాజీ ఎమ్మెల్యేలు టిడిపి టికెట్లు దక్కించుకుంటే రాబోయే సార్వత్రిక ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారుతుందనే వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాలో పది అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికలకు 16 నెలలు గడువు ఉన్న నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల వాతావరణం నెలకొంది. గత ఎన్నికల సమయంలో నిరాదరణకు గురైన మాజీ ఎమ్మెల్యేలు డిఎల్ రవీంద్రారెడ్డి, వరదరాజులరెడ్డి, వీరశివారెడ్డి, ద్వారకానాథరెడ్డి ప్రతిపక్ష టిడిపి టికెట్ దక్కించుకునే ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల డిఎల్ రవీంద్రారెడ్డి ప్రధాన పార్టీల తరుపున పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. కమలాపురం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి సైతం టికెట్ లభించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం సాగుతుండడం ఆసక్తికరంగా మారింది. ఇదే తరహాలో ప్రొద్దుటూరు బరిలో నిలిచేందుకు టిడిపి తరుపున లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్, వరదరాజులరెడ్డి క్యూలో ఉన్న సంగతి తెలిసిందే. వీరిలో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి టికెట్ ఇస్తే గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. రాయచోటి ప్రాంతానికి చెందిన గడికోట ద్వారకనాథరెడ్డి సైతం నేను సైతం పోటీ ఉన్నాననే సంకేతాలు ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. అధికార వైసిపి తరుపున ఆర్టీసీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి ఇస్తామనే ఆశ చివర్లో

అడియాశకు గురి చేసిన సంగతి తెలిసిందే.

గడప గడపతో ఆశావహుల ఆశలు గల్లంతు!

అధికార వైసిపిలో సిట్టింగుల్లో అత్యధికులు గడపగడపకూ మనప్రభుత్వం సర్వేలతో ఒక్క రాజంపేట మినహా పరిస్థితులను మెరుగుపరు చుకున్నట్లు సమాచారం. అధికార వైసిపి తరుపున టికెట్లు ఆశించే ఆశావహుల్లో ఆశలు సన్నగిల్లినట్లు అంచనాలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రతి లపక్ష టిడిపి తరుపున గట్టి ప్రత్యర్థులు కరువు కావడం ఆశావహులకు కలిసొచ్చింది. 2024 సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. రాజకీయ అనుభవం, ఎన్నికల నిర్వహణలో ఆరి తేరిన మాజీలకు టికెట్లు లభిస్తే అధికార వైసిపి గట్టి పోటీని ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయనే వాదనలు వినిపిస్తుండడం గమనార్హం.

ప్రొఫెషనలిస్టుల దిశానిర్దేశాలు కలిసొచ్చేనా

మాజీ ఎమ్మెల్యేల ఆర్థిక, అంగ, సామాజిక నేపథ్యాలకు తోడు పొలిటికల్ ప్రొఫెషనలిస్టుల సర్వేలు, అంచనాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆసక్తికర పోటీ వాతావరణం నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపి ప్రొఫెషనలిస్టుల సహాయంతో కమలాపురంలో 22,500 నుంచి జమ్మలమడుగులో 55,000 వేల ఓట్ల మెజార్టీలతో క్లీన్‌స్వీప్ చేసిన సంగతి తెలిసిందే. పైన పేర్కొన్న నాలుగు స్థానాల్లో మైదుకూరు, కమలాపురం స్థానాల్లో గెలుపు అవకాశాలు ఉన్నాయనే విశ్లేషణలు వ్యక్తమవుతుండడం ఆసక్తికరంగా మారింది. మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ పంచాయతీ ఎన్నికల దగ్గర నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు గట్టి పోటీనిచ్చే అధికార వైసిపిని ముప్పుతిప్పలు పెట్టిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో పుట్టా, డిఎల్ మధ్య రాజీ కుదిరించగలిగితే గట్టి పోటీ నెలకొనే అవకాశం ఉందని చెప్పవచ్చు. కమలాపురం నియోజకవర్గ టికెట్ విషయాన్ని పరిశీలిస్తే వరుసగా రెండు సార్లు ఓడిపోయిన అభ్యర్థులకు టికెట్లు ఇచ్చే అవకాశాలు లేవనే పార్టీ వర్గాల సమాచారం ప్రకారం వెళ్తే వీరశివారెడ్డికి టికెట్ లభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తిరుగుబాటు బెడదను అధిగమిస్తే గెలుపు అవకాశాల లోగిళ్లలోనికి చేరుకునే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

ఏం కష్టమొచ్చిందో..?

దంపతులకు ఏం కష్టమొచ్చిందో.. ముక్కుపచ్చలారని ఇద్దరి బిడ్డల్ని వదిలి చావుకు సిద్ధపడ్డారు. గుడికి వెళ్లి వస్తామని చెప్పి ఇంటి నుంచి బయలు దేరిన భార్యభర్తలు మైలవరం జలాశయంలోదూకి ఆత్మహత్య చేసుకున్నారు. తమ తల్లిదండ్రులకు ఏమైందో తెలియని చిన్నారులు వెక్కివెక్కి ఏడ్చారు. చిన్నారులను చూసి పలువురు కంట తడి పెట్టిన విషాద సంఘటన మైలవరం మండలంలో చోటు చేసుకుంది.

- మైలవరం జలాశయంలో దూకి దంపతుల ఆత్మహత్య
- ఆరోగ్య సమస్యలే కారణమా..?
- అనాథలైన ఇద్దరు చిన్నారులు

మృతిచెందిన వరలక్ష్మి, గోవర్ధన్

ఇద్దరి బిడ్డలతో దంపతులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - మైలవరం (కడప జిల్లా)

ఇద్దరు బిడ్డలను కట్టపై వదిలి భార్యాభర్తలు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన సోమవారం మైలవరం జలాశయం వద్ద చోటు చేసుకుంది. తల్లిదండ్రులు నీటిలో దూకడంతో ఏమి చేయాలో పాలుపోని చిన్నారులిద్దరు ఏడుస్తూ స్థానికులకు కనిపించారు. వారు విషయాన్ని పోలీసులకు చేరవేశారు. వివరాలలోకి వెళితే...మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన పల్లా గోవర్ధన్(34) పక్క గ్రామమైన దొమ్మర నంద్యాలకు చెందిన వరలక్ష్మి(32) ఐదేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల వైష్ణవ శ్రీసాయి, ఒకటిన్నర సంవత్సరాల హిమకర శ్రీసాయి కుమారులు. గోవర్ధన్ కడప నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఆకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. కడపలోనే నివాసం ఉంటున్నారు. సోమవారం ఉదయం మైలవరం జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దంపతుల కోసం గజ ఈతగాళ్లతో వెతికించారు. తొలుత వరలక్ష్మి మృతదేహం లభ్యమైంది. మధ్యాహ్నం తర్వాత గోవర్ధన్ మృతదేహం లభ్యమైంది. తల్లిదండ్రుల మృతదేహాలను చూసిన అభంశుభం తెలియని చిన్నారులు ఏడ్పులను చూసిన వారు కూడా కంటతడి పెట్టారు. ముక్కు పచ్చలారని పిల్లలను వదిలేసి ఆ తల్లిదండ్రులు ఆత్మహత్య ఎలా చేసుకోవాలనిపించిందనే అక్కడికి వచ్చిన వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడు, కోడలు ఆత్మహత్య చేసుకున్నారన్న విషయం తెలుసుకున్న గోవర్ధన్ తల్లి లక్ష్మీదేవి సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. నాలుగు రోజుల క్రితమే గోవర్ధన్ వేపరాలకు వచ్చారని ఆమె చెప్పారు. తన ఆరోగ్యం సరిగా లేదని, బతకాలని కూడా లేదని చెప్పాడని ఆమె తెలిపారు. గుడికి వెళుతున్నామని తన భార్యబిడ్డలతో కలిసి వెళ్లారన్నారు. మృతుని తల్లి లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అనాథలైన చిన్నారులు..

తల్లిదండ్రులు చనిపోవడంతో అభంశుభం తెలియని చిన్నారులు అనాథలుగా మిగిలారు. అమ్మానాన్నలకు ఏమైందో తెలియని అమాయకపు చూపులు చూస్తున్న చిన్నారులకు ఇక నుంచి తమ ఆలనా పాలన చూసే వారెవరో తెలియని పరిస్థితి. అమ్మకోసం వెక్కి వెక్కి ఏడుస్తున్న చిన్నారులను చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

అమ్మకోసం ఏడుస్తున్న చిన్నారి

సమస్యలు డిఎల్‌ఎస్‌ఎ దృష్టికి తేవాలి : జడ్జి

కడప : ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ డిఎల్‌ఎస్‌ఎ దృష్టికి తీసుకురావాలని సీనియర్ సివిల్ జడ్జి, డి ఎల్ ఎస్ ఎ సెక్రటరీ ఎస్. కవిత సూచించారు. ఆజాద్ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా సోమవారం వన్ స్టాప్ సెంటర్, శిశు గృహం, చౌడమ్మ ఓల్డ్ ఏజ్ హోమ్‌లను జడ్జి సందర్శించారు. అక్కడ న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. రిజిస్టర్లను పరిశీలించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2015 వివరించారు. సీనియర్ సిటిజన్ చట్టం, టోల్ ఫ్రీ నెంబర్ 14567 పట్ల అవగాహన కలిగించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తహశీల్దార్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. ఎల్లవేళల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

'శ్రీ వైష్ణవి' విద్యార్థులకు మొదటి స్థానం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

ప్రతిభచాటిన విద్యార్థులు

హిందూపురం వాల్మీకి భవన్‌లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు నిర్వహించిన జాతీయ నృత్య సంగీత పోటీలలో శ్రీ వైష్ణవి సిబిఎస్‌సి విద్యార్థులు పాల్గొని మొదటి స్థానం సంపాదించారని పాఠశాల కరస్పాండెంట్ ఆర్.వి.రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి, బహుముఖ ప్రజ్ఞా పాటవాలను పెంపొందించే విధంగా కరికులం రూపొందించామన్నారు. విద్యార్థుల మానసిక ఉల్లాసానికి ఆట పాటలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కల్యాణి, ప్రిన్సిపల్ ఆర్. మల్లికార్జున, అకడమిక్ ఇన్‌ఛార్జి ఆదమ్, కేశవ రాయుడు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారికి సన్మానం

చెన్నూరు : మండలం ప్రత్యేక అధికారిగా డాక్టర్ హెచ్. వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎంపిపి కార్యాలయంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జి ఎన్ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య కలిసి అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. కనపర్తి గ్రామ సమీపంలో ఉన్న జగనన్న లేఅవుట్ కాలనీకి సంబంధించి పనులపై చర్చించారు. సొంత స్థలాలు, గృహ లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపిపి ఆధ్వర్యంలో మండల ప్రత్యేకాధికారిని సన్మానించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మేనిల్, రాచినా పల్లె సర్పంచ్ సొంట్టం నారాయణరెడ్డి, మండల కో- ఆప్షన్ నెంబర్ వారిష్, హస్రత్, టి ఎన్ చంద్ర రెడ్డి, వైసిపి ఎస్‌టి సెల్ సురతాని శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీర్ ఇంతియాజ్‌కు జాతీయ అవార్డు

కడప అర్బన్ : నగరానికి చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ ఇంజినీర్ ఇంతియాజ్ అహ్మద్‌కు ఢిల్లీ రాడిసన్ బ్లూ ఫైవ్ స్టార్ హోటల్‌లో సోమవారం గ్లోబల్ ఎంపైర్ ఈవెంట్స్ వారు బెస్ట్ ఆర్కిటెక్చర్, బెస్ట్ ఇంటీరియల్ డిజైనర్ కేటగిరి కింద ఐకాన్ ఆఫ్ ఆసియా 2022 అనే జాతీయ స్థాయి అవార్డును అందజేశారు. దేశంలో ఉన్న సుమారు 1200 పైన ఆర్కిటెక్చర్ సంస్థలు అవార్డుకు దరఖాస్తు చేసుకున్నాయి. వారికీ రెండు దశలలో పరిశీలించి పి.ఎస్ డిజైన్ అండ్ కన్స్ట్రక్షన్ చేస్తున్న సేవలను గుర్తించి ఐకాన్ ఆఫ్ ఆసియా 2022 అనే జాతీయ స్థాయి అవార్డును అందచేశారని ప్రముఖ ఆర్కిటెక్ట్ ఇంజినీర్ ఇంతియాజ్ అహ్మద్ తెలియజేశారు. పి.ఎస్ డిజైన్ అండ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ పేరిట15 సంవత్సరాల నుంచి ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు, ఉచితంగా ప్రార్థన మందిరాలు కట్టడాలు చేశామని తెలిపారు.

వైసిపి పాలనతో ప్రజలు విసిగిపోయారు

కడప అర్బన్ : వైసిపి పాలనలో ప్రజలు విసిగిపోయారని టిడిపి నాయకులు అన్నారు. సోమవారం 39వ డివిజన్ చిలకలబావి వద్ద నగర టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్చార్జి వి.ఎస్ అమీర్ బాబు, రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి బి.హరిప్రసాద్, నగర అధ్యక్షులు సానపురెడ్డి శివ కొండారెడ్డి, రైతు నాయకుడు లక్ష్మి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుపై వ్యాపారులు, ప్రజలు నానా తిప్పలు పడుతున్నారని తెలిపారు. వారందరికి అండగా టిడిపి ఉంటుందని చెప్పారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న జెసి సాయికాంత్‌వర్మ

: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గృహ నిర్మాణ పథకం, ప్రాధాన్యత భవన నిర్మాణ పనుల ప్రక్రియను వేగవంతంగా, యుద్ధ ప్రాతిపదికన చేసి లక్ష్యాన్ని అధిగమించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పౌర సేవలు, సంక్షేమ పథకాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందేలా ప్రతి అధికారి నిబద్ధతతో పని చేయాలన్నారు. లక్ష్య సాధన కోసం మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతి వారమూ ప్రగతి నివేదికలు అంద జేయాలన్నారు. ఈ సందర్భంగా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలోని లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ ఒక్కొక్కరిని అడిగి తెలుసు కున్నారు. ఇళ్లన్నీ సత్వరమే ప్రారంభించి బిబిఎల్ స్థాయిలో ఉండేలా చూడాలన్నారు. గృహ నిర్మాణ పనుల్లో అధికారులు చిత్త శుద్ధితో పనిచేసి నిర్దేశించిన, ఆశించిన పురోగతిని చూపిస్తూ ప్రతి అంశాన్ని ఆన్ లైన్‌లో నమోదు చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు ఈ వారం చివరిలోగా సచివాలయాల పరిధిలో ప్రయారిటీ బిల్డింగ్స్ గ్రౌండింగ్ పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో .మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, కడప ,బద్వేలు, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, హౌసింగ్ పీడీ మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

గండికోటలో ఢిల్లీ హైకోర్టు జస్టిస్ తల్వంత్ సింగ్

జమ్మలమడుగు రూరల్ : గండికోటలో ఢిల్లీ హైకోర్టు జస్టిస్ తల్వంత్‌సింగ్ విచ్చేవారు. సోమవారం మర్యాదపూర్వకంగా జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవగుడి నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి పాలాజీ రవికుమార్, అర్బన్ సిఐ సదాశివయ్య, కోర్టు సిబ్బంది, న్యాయ వాదులు ఆయనకు ఆహ్వానం పలికారు.

రక్త కణాలు దానం

ప్రజాశక్తి- కడప అర్బన్



రక్తకణాలుదానం చేస్తున్న ఇంతియాజ్

ఖున్ కా రిష్తా ఛైర్మెన్ ఎం.తారిఖ్‌అలి ఆధ్వర్యంలో సోమవారం రక్త కణాలు దానం చేశారు. పులివెందుల శ్రీ సిరి హాస్పిటల్‌లో అరుణా అనే మహిళకు డెంగీ జ్వరంతో రక్తకణాలు తగ్గు ముఖం పట్టాయని, మెరుగైన చికిత్స నిమిత్తం డాక్టర్ బి పాజిటివ్ రక్తకణాలు అత్యవసమని సూచించారు. విషయం తెలిసిన వెంటనే ఖున్ కా రీష్టా ఛైర్మెన్‌ను సంప్రదించారు. విషయాన్ని రక్తదాత ఇంతియాజ్‌కు తెలుపగా సానుకూలంగా స్పందించారు. కడపలోని బృహద బ్లడ్ బ్యాంక్ వద్దకు స్వచ్ఛందంగా వచ్చి బి పాజిటివ్ రక్తకణాల దానం చేసి ఉదారతని చాటుకున్నారు. అత్యవసర సమయాల్లో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తకణాల దానం చేసిన శాస్వత రక్తదాత ఇంతియాజ్‌కు ఖున్ కా రిష్త సంస్థకు అరుణ కుటుంబ సభ్యులు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తారిక్ అలి మాట్లాడుతూ ఇంతియాజ్ చేసిన ఈ రక్తకణాల దానం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపాలని కోరుకుంటున్నమని తెలిపారు. కార్యక్రమంలో బృహద బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి శ్యామ్, టెక్నీషయన్లు సన్నీ,బిబి జాన్,సౌజన్య, కార్తిక్,సంతోష్ పాల్గొన్నారు.

విజయబాబుకు గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - కడప అర్బన్

'గజ్జెల మల్లారెడ్డి జీవన సాఫల్య పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు అందుకున్నారు. వైవీయూ, గజ్జెల మల్లారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనకు సన్మాన పత్రం, జ్ఞాపికతో పాటు రూ.50 వేల నగదు విసి సూర్యకళావతి అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కపటత్వంపై యుద్ధభేరి మోగించిన గజ్జల మల్లారెడ్డి ఈ ప్రాంత వాసి కావడం గర్వకారణమని చెప్పారు. వాక్చాతుర్యం, ఉపన్యాసపటిమ, మహోన్నత వ్యక్తిత్వం, ఉత్తమ జర్నలిస్టు లక్షణాలు కలిగిన గజ్జల మల్లారెడ్డి నేటి తరానికి ఆదర్శనీయులని కొనియాడారు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన గజ్జల మల్లారెడ్డి గొప్ప వ్యక్తిగా ఎదిగిన క్రమం స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన ఉపన్యాసాల కోసం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎడ్లబండ్లు కట్టుకొని హాజరయ్యే వారంటే ఆయన వాగ్ధాటి ఎంత ప్రభావంతంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

'జీవనాధార భూములు ఇవ్వం'

-కలెక్టరేట్ ఎదుట గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే కోసం బలవంతంగా తమ భూములు తీసుకోవడం చాలా అన్యాయమని, భూములు ఇవ్వబోమని భూ నిర్వాసిత రైతులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఆ భూములే జీవనాధారం అని రెండు, మూడు పంటలు పండే బంగారు లాంటి భూములలో ఎక్స్ ప్రెస్ హైవే రోడ్డు కోసం భూములు తీసుకుంటే రైతులకు ఆత్మహత్యలే గతని తెలిపారు. చాపాడు మండలం ద్వారకా నగర్ పిచ్చపాడు గ్రామ రైతులు 93 ఎకరాల వ్యవసాయ భూమిని తీసుకోవడం చాలా అన్యాయమని పేర్కొన్నారు. రెండు, మూడు పంటలు పండే భూమి పంటలు పండించుకుంటున్నారని చెప్పారు. ఇప్పుడు జీవనాధారం కోల్పోతున్నారని వాపోయారు. భూములు పక్కనే కేసీ కెనాల్ సంబంధించిన పోరంబోకు డీకేటి అసైన్డ్ భూములు 100 ఎకరాల వరకు ఉన్నాయని ఆ భూములు తీసుకుని, విలువైన భూముల జోలికి రావద్దని కోరారు. భూములు తీసుకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్, భూముల కోల్పోయిన రైతులు రామసుబ్బారెడ్డి, చిన్న వీరారెడ్డి, హజరత్ రెడ్డి, మహిళా రైతులు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర నాయకుడిని కలిసిన సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

సేవా కార్యక్రమాలు వివరిస్తున్న సలావుద్దీన్

తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు టి.డి.జనార్ధన్‌ను సోమవారం ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్ మర్యాద పూర్వకంగా కలిశారు. సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. 2019లో కడప నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇండిపెండెంట్‌గా పోటీ చేశానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజాసేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మైనార్టీలు తనకు అండగా ఉన్నారని చెప్పారు. దీనిపైన స్పందించిన జనార్ధన్ చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

మోసపూరిత ప్రభుత్వం : టిడిపి

మాట్లాడుతున్న హరికృష్ణ

కడప : వైసిపి ప్రభుత్వం నిత్యం మోసపూరిత ప్రకటనలు, హామీలతో ప్రజలను మోసం చేస్తోం దని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పాదయాత్రలో , అవ్వ తాతలకు ముద్దులు పెట్టి అధికారంలోకి వచ్చాక అవ్వ, తాతల పెన్షన్లను తొలగిస్తూ వారిని మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. నాడు తెలుగుదేశం ప్రభుత్వంలో పెన్షన్ ఒక్కసారిగా రూ. 200 నుండి రూ. 2000 వరకు పెంచి, మూడు నెలలకు ఒకసారి కొత్త పెన్షన్లను మంజూరు చేస్తూ 100 శాతం పెన్షన్లు అందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వం దేనని అన్నారు. పాత పెన్షన్లను ఏనాడు తొలగించలేదని అన్నారు. కానీ ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా పాత పెన్షన్లు తీసేవేందుకు శ్రీకారం చుట్టిందని అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు నాలుగు లక్షల నుంచి ఐదు లక్షలు పెన్షన్లను తొలగించడం అన్యాయమని వాపోయారు. సమావేశంలో టిఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ, రెడ్డయ్య యాదవ్,అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదగాలి

చెన్నూరు : విద్యార్థులు మెరుగైన ఉన్నత విద్యను అభ్యసించి భావిభారత పౌరులుగా ఎదగాలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జి ఎన్ భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. సోమవారం వారు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఉర్దూ విద్యార్థులకు పరీక్షల స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు ఉర్దూ అకాడమీ తరపున ప్రతి సంవత్సరమూ ఉర్దూ పదవ తరగతి విద్యార్థుల కోసం పబ్లిక్ ఎగ్జామ్ స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలగా ఇష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత సాధించి వారు ఆకాంక్షించారు, అలాగే విద్యార్థులను ఉన్నత శిఖరాలు చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది గారివెంకటసుబ్బయ్య మండల కో - ఆప్షన్ నెంబర్ వారిస్, స్కూల్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రబ్, డాక్టర్ పిచ్చయ్య, హస్రత్, వైసిపి ఎస్టీ సెల్ కన్వీనర్ సురతాని శ్రీనివాసులు, హెచ్ఎం విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ గోడకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

జమ్మలమడుగు నియోజకవర్గంలోని మైలవరం రిజర్వాయర్ ఆనకట్ట పైన రక్షణ గోడ, రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయని, లైట్లు లేవని వీటిని అధికారులు ఇంకెప్పుడు మరమ్మతులు నిర్వహిస్తారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నించారు.సోమవారం డివైఎఫ్ఐ అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం స్పందన లో ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం లోని మైలవరం రిజర్వాయర్ అభివృద్ధి పైన అధికారుల, ప్రభుత్వం నిర్లక్ష్యం పూర్తిగా కనబడుతుందన్నారు. మైలవరం రిజర్వాయర్ ఆనకట్ట పైన రక్షణ గూడ పూర్తిగా దెబ్బతిని సంవత్సరాలు గడుస్తున్నా అటువైపు చూసే అధికారే లేరని వాపోయారు. ఆనకట్ట పైన రోడ్డు కూడా సరిగ్గా లేదన్నారు. రాత్రి పూట కనీసం ఒక్క లైటు కూడా లేదన్నారు. పర్యాటక ప్రాంతమైన గండికోట చూడటానికి దూరప్రాంత ప్రజలు వస్తున్నారని తెలిపారు. వాటితో పాటు మైలవరం రిజర్వాయర్ చూడటానికి, బోటింగ్ చేయడానికి పర్యాటకులు వందల సంఖ్యలో వస్తున్నారని చెప్పారు. కనీసం వారికి రక్షణ సౌకర్యాలు కూడా లేవన్నారు. నిత్యం ఆత్మహత్యలకు నిలయంగా రిజర్వాయర్ తయారైందన్నారు. ప్రభుత్వం మైలవరం రిజర్వాయర్ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతుందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు,ప్రభుత్వం ఆనకట్ట పై రక్షణ గోడ అభివృద్ధి, రోడ్లు, లైట్లు బాగు చేయాలని కోరారు. లేనిపక్షంలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు షాకీర్,నాయకులు మధు,సుబ్బన్న పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కలసపాడు : ఇటీవల బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లి అచలానంద ఆశ్రమం వద్ద నిర్వహించిన క్రీడాపోటీల్లో కలసపాడు సెయింట్ ఆంటోనీ ఇంగ్లీషుమీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం విజేతలను కరస్పాండెంట్ చిత్త రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ, పరుగు పందెంలో తమ పాఠశాల విద్యార్థులు రాణించారని చెప్పారు. అనంతరం వారిని ప్రిన్సిపల్ చిత్తా ప్రభావతి, పిఇటిలు ఎం. ప్రసాద్‌రావు, కోమలమేరి, ఉపాధ్యాయులు అభినందించారు.

పెన్షన్లు రద్దు చేస్తే ఊరుకోం : డిసిసి

ప్రజాశక్తి - కడప

స్థానికులతో మాట్లాడుతున్న నీలి శ్రీనివాసరావు

సామాజిక పెన్షన్ రద్దు చేస్తే చూస్తూ ఊరుకోబోమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు హెచ్చరించారు. చింతకొమ్మదిన్నె మండలంలోని 16వ డివిజన్‌లో సోమవారం కాంగ్రెస్ శ్రేణులు ఆయన పర్యటించారు. గ్రామ సచివాలయానికి సంబంధించి16/2లో 487 సామాజిక పింఛన్లు ఇచ్చేవారని, ఇప్పుడు 99 మంది లబ్ధిదారులకు వివిధ కారణాల చేత నోటీలు ఇచ్చామని సచివాలయ అధికారి మైఖేల్ కాంగ్రెస్ నాయకులకు చెప్పారు. అనంతరం స్థానికులు నాయకుల ఎదుట తమ బాధను వ్యక్తంచేశారు. ఇల్లు పెద్దగా ఉందని, కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని అధికారులు నోటీసులు ఇచ్చారన్నారు. 15 రోజుల లోపల నిరూపించుకోకుంటే, పెన్షన్లు రద్దు చేస్తామని చెప్పారన్నారు. నోటీసులు అందుకున్న వృద్ధులు నెలకు వైద్య ఖర్చులే రూ. 3500 అవుతున్నాయని వాపోయారు. ఇప్పుడు అర్థాంతంగా జగన్ ప్రభుత్వానికి నిబంధనలు గుర్తుకు వచ్చాయా అని వారు అన్నారు. తప్పకుండా ఈ సమస్య తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, ఏ ఒక్కరికి పెన్షన్ పోకుండా ఉండే విధంగా ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు నియోజకవర్గ నాయకులు తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్, సుబ్బరాయుడు, సూర్యుడు, సత్య పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కులను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి కడప అర్బన్

నగరంలో ఉన్న పిల్లలకు ప్రత్యేక చిల్డ్రన్స్ పార్కులను ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమైక్య నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు డిమాండ్ చేశారు. సోమవారం పాత బస్టాండ్ లోని డివైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరవ్యాప్తంగా దాదాపుగా 20 వేలకు పైగా చిన్న పిల్లలు ఉన్నారని, వీరి కోసం ప్రత్యేక చిల్డ్రన్స్ పార్కులో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ప్లే స్కూల్స్ పేరుతో సంవత్సరానికి రూ.30 వేలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. నగర పాలక సంస్థ రాజీవ్ పార్క్, నెహ్రూ పార్క్ లను చిల్డ్రన్స్ పార్కుగా మార్చాలని వాటితో పాటు తాజ్ కాట కు ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు వెనకాల ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇతర ప్రాంతాలలో ప్రభుత్వ స్థలాలలో పార్కులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచే కరోనాను నియంత్రించాలి

ప్రజాశక్తి - చక్రాయపేట

గ్రామస్థాయి నుంచే కరోనాను నియంత్రించాలని ఎంపిపి మాధవి బాలకృష్ణ పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ కరోనా ఫోర్త్ వేవ్ మళ్లీ వ్యాప్తి చెందుతోందన్నారు. దీనిపై అందరం అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జడ్‌పిటిసి టి.శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మనం కూడా తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రభుత్వం కూడా ఆ మేరకు చర్యలు చేపడుతుందన్నారు. కరోనాను అరికట్టేందుకు ప్రభుత్వం చేపట్టే చర్యలకు ప్రజలు, ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

శివప్రసాద్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వేంపల్లె

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న శివప్రసాద్, నందినీ, జ్ఞానేశ్వర్‌ను మానవతా సభ్యులు పరామర్శించారు. కొద్ది రోజులు క్రితం గాయపడిన వారిని ఆర్‌టిసి బస్సు ఢీకొని, కాళ్లు విరిగి తీవ్రంగా గాయ పడ్డారు. ఆసుపత్రి నుండి ఇంటికి వచ్చిన నందినీ, జ్ఞానేశ్వర్‌ను ఆదివారం సాయంత్రం మానవతా సభ్యులు పరామర్శించి వారి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా ఆదుకొనేందుకు కృషి చేస్తామని మానవతా సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణతేజా పేర్కొన్నారు. అంబులెన్స్‌లో తిరుపతి ఆస్పత్రికి పంపించేందుకు మాజీ జడ్‌పిటిసి డాక్టర్ ఎస్ఎఫ్ బాషాతో చర్చించారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మానవత సభ్యులు

ఉర్దూ పాఠశాలలో పందుల సంచారం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిలమకూరు ఉర్దూ పాఠశాలకు సరైన ప్రహరీ లేకపోవడంతో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. వీటి సంచారంతో తమ పిల్లలు అనారోగ్యం పాలవుతారని వారి తల్లి దండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలో సంచరిస్తున్న పందులు

మరమ్మతులకు నోచుకోని బోరు

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని జోసప్‌పేట సియస్ఐ స్కూల్‌కు వెళ్లే దారిలో తాగునీటి బోరు చెడిపోయి, మరమ్మతులకు నోచుకోలేదు. కొన్ని నెలలు అవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం కిలో మీటర్ దూరం పోతున్నామని వాపోతున్నారు. సమస్యను పలుమార్లు మున్సిపల్ అధికారులకు, మున్సిపల్ కౌన్సిలర్‌కు, మున్సిపల్ ఛైర్మన్ మాచునూరు చంద్ర, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న బోరు

బ్రౌన్ గ్రంథాలయ నిర్వహణ భేష్

కడప అర్బన్ : సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో పుస్తకాల నిర్వహణ, ప్రాచీన రాతప్రతులను భద్రపరచడం, అన్నిరకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచడం, విశ్వవిద్యాలయాల్లో పరిశోధన చేసే పరిశోధకులకు తోడ్పడే సిద్ధాంత గ్రంథాలను, ప్రత్యేక సంచికలను ఉపయుక్తంగా ఉంచడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు పేర్కొన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ముందుగా ఆయన గ్రంథాలయ ప్రాంగణంలోని సి.పి.బ్రౌన్, డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, సి.కె.సంపత్ కుమార్ విగ్రహాలకు పూలమాల సమర్పించి నివాళులర్పించారు. సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, గ్రంథాలయ సిబ్బంది కలిసి పి.విజయబాబును శాలువతో సత్కరించి, గ్రంథాలయ ప్రచురణలను బహూకరించారు.

ఫిర్యాదులపై స్పందించి న్యాయం చేయాలి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పి అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

పోరుమామిళ్ల టౌన్ : ఎవరికి ఏ కష్టం వచ్చినా,ఏ అవసరం వచ్చినా తాను ఉన్నానంటూ ముందుండి ఆపన్న హస్తంతో ఆదుకున్న మహనీయుడు వంగవీటి మోహన రంగా అని బద్వేల్ నియోజకవర్గ యువ బలిజ సంఘం అధ్యక్షులు రుద్రా శ్రీకాంత్‌రాయులు, సీతా బాలాజీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక బలిజ సంఘం కార్యాలయంలో వంగవీటి మోహనరంగా 34వ వర్ధంతి సందర్భంగా యాచకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని పిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో తుపాకుల నాగయ్య, ఉల్లి వెంకట రమణయ్య, సీతా హరి, సవరం రమేష్, సోమిశెట్టి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ వెంకట సుబ్బయ్య

చెన్నూరు : మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ హెచ్. వెంకటసుబ్బయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పటాన్ అలీ ఖాన్, యుపిఆర్‌డి సురేష్ బాబు, ఎఇలు మురళీకృష్ణ, మిలిన్, ఎపిఒ సుధారాణి, ఎబిఎస్ గంగాధర్, ఏవో శ్రీదేవి, హాయ్ సురేష్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తేక్వాండోలో క్రీడాకారుల సత్తా

రాజంపేట అర్బన్: జాతీయ స్థాయి తేక్వాండో పోటీలలో రాజంపేట క్రీడాకారులు సత్తా చాటారని ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్, మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కడప జిల్లా కార్యదర్శి కొన్నిపాటి వెంకటేష్, కోచ్ సి.దామోదర్‌రాజు పేర్కొన్నారు. ఈ నెల 24, 25వ తేదీలలో ఒంగోలులోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన 25వ జాతీయ స్థాయి ఐటిఎఫ్ తేక్వాండో పోటీలలో రాజంపేటకు చెందిన వి.వరుణ్ కుమార్ రజతం, ఎం.యశ్వంత్, ఎం.అలంకృత కాంస్య పతకాలు సాధించారు. ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సోమవారం క్రీడాకారులకు పతకాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. అనంతరం మాస్టర్లు సునీల్, వెంకటేష్, దామోదర్ రాజు మాట్లాడుతూ రాజంపేట క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం హర్షనీయమన్నారు. విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని మన ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేశాయని, విద్యార్థులు క్రీడలలో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించిన మాస్టర్ దామోదర్ రాజును ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, సంయుక్త కార్యదర్శులు అద్దాల మద్రి ఉమాశంకర్, కె.నాగరాజ, కోశాధికారి అయ్యపురాజు చంద్ర, గౌరవ సలహాదారులు వర్ల నరసింహులు, టి.చంద్రశేఖర్, కె.గంగారామ్ ప్రత్యేకంగా అభినందించారు.

అకాల వర్షాలు.. వరి రైతులకు ఇక్కట్లు

- ధాన్యం మొలక వచ్చి, రంగు మారుతోందని రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - చాపాడు

మబ్బులు కమ్ముకుంటూ అడపదడపా శనివారం రాత్రి నుంచి పడుతున్న వర్షానికి నియోజకవర్గ వ్యాప్తంగా వరి పంట నూర్పిడి చేసే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులపాటు తేలికపాటి వర్షాలు ఉన్నాయని అధికారులు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 53,000 ఎకరాల్లో వరి పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉంది. రైతులు వరి పంట నూర్పిడి చేసి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. వర్షం పడుతుండడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడాల్సివస్తోంది. ముఖ్యంగా మండల పరిధిలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. ముందస్తుగా బోరు బావులు, ఫిల్టర్లు అందుబాటులో ఉన్న రైతులు ఆగస్టు మొదటి వారంలో వరి పంటను సాగు చేసిన రైతులు నూర్పిడి పూర్తి చేశారు. మళ్లీ పంటలు సాగు చేస్తున్నారు. అక్టోబర్‌లో సాగుపైనే పంటలో ప్రస్తుతం నూర్పిడి పనులు ప్రారంభించారు. గత వారంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఎడతెరిపి లేకుండా వర్షాలు పడ్డాయి. దీంతో వరి పంట నేలకొరిగి రైతులు ఇబ్బందులు పడ్డారు. నాలుగు రోజులు వర్షాలు లేకపోవడంతో మళ్లీ నూర్పిడి పనులు చేపట్టారు. ఆదివారం నుంచి వర్షం పడుతుండడంతో నూర్పిడి చేసిన వరి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. పంట పొలాల్లో వరి పంటను నూర్పిడి చేయకుండా అలానే ఉంచితే ధాన్యం తడిచి మొలకలు వచ్చి, వస్తువు రంగులోకి మారుతున్నాయి. వరి కోత మిషన్ల ద్వారా బురదలోనే నూర్పిడి పనులు చేపడుతున్నారు. వరి ధాన్యాన్ని రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ పట్టాలను పరచి కప్పి ఉంచుతున్నారు. వర్షం పడుతుండడంతో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవకాశం ఏర్పడడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి ధాన్యం రంగు మారుతుందని రైతులు వాపోతున్నారు. మండల పరిధిలో సిద్దారెడ్డిపల్లె, సోమాపురం, బద్రిపల్లె, తిప్పిరెడ్డిపల్లె, కుచ్చుపాప గ్రామాల పరిధిలో, మైదుకూరు, ఖాజీపేట మండల పరిధిలో ముమ్మరంగా వరి పంట నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుని వెసులుబాటు లేకపోవడంతో రోడ్లపైనే ధాన్యాన్ని రైతులు కుప్పలుగా పోసి ప్లాస్టిక్ పట్టలు కప్పి ఉంచుతున్నారు.

మైదుకూరు వద్ద జాతీయ రహదారిపై వరి ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

పింఛన్ల రద్దును ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సామాజిక పింఛన్ల లబ్ధిదారుల సంఖ్యను కుదింపు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివ నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2023 జనవరి 1 నుంచి పింఛన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ.2750 వరకు పెంచడాన్ని సిపిఎం హర్షిస్తోం దన్నారు. అయితే పెంచిన మొత్తాన్ని గతంలో ఉన్న లబ్ధిదారులందరికీ వర్తింపజేయకుండా లబ్ధిదారుల సంఖ్యను కుదించే ప్రయత్నం సమంజసం కాదన్నారు. పింఛన్ పొందుతున్న వారిలో వితంతువులు, విభిన్న ప్రతిభా వంతులు, ఒంటరి మహిళలు, వృద్ధులు తదితర విభాగాల వారున్నారని తెలిపారు. వీరంతా పింఛన్ మీదనే ఆధారపడి జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల సంఖ్యను కుదించాలనే ప్రయత్నాన్ని ప్రభు త్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జమ్మలమడుగులో ప్రతి వార్డులో 20 నుంచి 60 పింఛన్లలో కోత కోశారని, దీనివల్ల ప్రజల ఆర్థిక పరిస్థితుల మీద తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్క పింఛన్ తొలగించినా సిపిఎం చూస్తూ ఊరుకోదని, పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రవి, మన్సూర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరనాల శివనారాయణ

మోటార్ సైకిల్ రంగంలో రారాజు 'హీరో'

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మోటార్ సైకిల్ రంగంలో రారాజు హీరో సంస్థ అని, ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ అన్ని రకాల వాహన సేవలు కొనసాగిస్తోందని స్థానిక శివప్రియ ఆటోమొబైల్ షోరూం నిర్వాహకులు మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. రెండేళ్లుగా పట్టణంలో శివప్రియ ఆటో మొబైల్ సంస్థ ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ అందరితో సాన్నిహితంగా ఉంటోందన్నారు. అధిక విక్రయాలు చేస్తూ ప్రజల మన్ననలతోపాటు శివప్రియ ఆటో మొబైల్ కంపెనీ మన్ననలు కూడా పొందింది. మల్లికార్జురెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరం సందర్భంగా హీరో సంస్థ ప్రజల సౌకర్యార్థం సరికొత్త ఆలోచనలతో, డిజైన్లు, అత్యాధునికమైన టెక్నాలజీతో(బిఎస్ 6) మోడల్స్, బ్లూటూత్, సెల్‌ఫోన్ ఛార్జింగ్, సైడ్ స్టాండ్, ఇంజిన్ కట్ ఆఫ్ డిజిటల్ మీటర్, ఎల్ఇడి బల్కాల్ అండ్ ఎస్ఎంఎస్ అలాట్, నావిగేషన్ హీరో సంస్థ వాహనాలను అందిస్తున్నదని వివరించారు. ప్రజలు కూడా కొత్త ఆలోచనలు చేయాలని, కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని శివప్రియ ఆటో మొబైల్ అందరికీ అనుకూలంగా ఉండే రీతిలో తనదైన శైలిలో ఆఫర్లను కూడా ప్రకటించింది. శివప్రియ ఆటోమొబైల్స్ షోరూంలో హీరో బైకుల అమ్మకాలతోపాటు స్పేర్ పార్ట్స్ కూడా లభిస్తాయి. నాణ్యమైన సర్వీస్ కూడా లభిస్తుందని మల్లికార్జునరెడ్డి తెలిపారు.

శివప్రియ హీరో షోరూం (ఇన్‌సెట్) ప్రొప్రయిటర్ మల్లికార్జున రెడ్డి

ఆఫర్లు : హీరో స్కూటర్ కొనుగోలుపై రూ.6000 నుండి రూ.10,000 వరకు తగ్గింపు, 100సి.సి.బైకు కొనుగోలుపై రూ.4000 నుండి రూ.6000 వరకు తగ్గింపు, 125 సిసి బైకుపై రూ.6000 నుండి రూ.10,000 వరకు తగ్గింపు. అంతేగాక వాహన యజమాని రక్షణ కోసం హెల్మెట్‌తోపాటు బాడీ కవర్ కూడా ఉచితంగా ఇస్తున్నారు.

వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

మాట్లాడుతున్న చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి, కమిషన్ నర్సింహారెడ్డి ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన శానిటేషన్ కమిటీ సభ్యులు సమావేశంలో వారు మాట్లాడుతూ రోడ్లపై చెత్త వేయకుండా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, శానిటేషన్ కమిటీ సభ్యులు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. వర్షాలు పడుతున్న కారణంగా సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కరోనా 4వ దశ వస్తోందనే వార్తల కారణంగా సచివాలయం శానిటరీ సెక్రెటరీలు వారి సచివాలయం పరిధిలోని వార్డు వాలంటరీలతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి కరోనా బూస్టర్ డోస్ వేయించుకోని వారిని గుర్తించాలన్నారు. వారికి కచ్చితంగా కరోనా బూస్టర్ డోస్ వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛ పులివెందులను ప్రతి ఒక్కరూ తమ భాధ్యతగా స్వీకరించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్ల ఏర్పాటుపై దృష్టి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ కన్వీనర్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఆయన ఎంపిటిసిలు, సర్పంచులు, పార్టీ నేతలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి 50 ఇళ్లకు ముగ్గురు కన్వీనర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఇద్దరు పురుషులు, ఒక మహిళ ఉండాలన్నారు. ఆయా పరిధిలో వారు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా, అందులో అర్హులు ఉన్నారా లేదా అని గుర్తించాలన్నారు. అంతేకాక వైసిపి ప్రభుత్వంపై మక్కువ పెంచుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత వారిపై ఉంటుందన్నారు. ఈ విషయంలో మీరంతా ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎంపిపి శేఖర్ యాదవ్, వెలవలి నారాయణరెడ్డి, పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

మామిడిలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలి

ప్రజాశక్తి - వేంపల్లె

మామిడిలో పూత రావడానికి రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి రెడ్డయ్య సూచిం చారు. మండలంలోని ఇడుపులపాయ గ్రామంలో సాగు చేసిన మామిడి తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఇడుపుల పాయలోని రైతు భరోసా కేంద్రంలో మామిడి రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి చెట్లుకు పూత వచ్చే దశలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మామిడి తోటల్లో తేనె ముంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వాటి నివారణకు పలు సూచనలు చేశారు. పొగమంచు పడుతున్న నేపథ్యంలో బూడిద తెగులు, పూతకుడు తెగులు, మచ్చ తెగుళ్ల ఉధృతి అధికం కావచ్చునన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ విహెచ్ఎ షర్ఫుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

పంటల వివరాలను పరిశీలిస్తున్న రెడ్డయ్య

IN THE COURT OF THE IIND ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA.

O.S.NO. 329 /2020

1. Eragamreddy Bindu Bhargavi Reddy,
2. Eragamreddy Siva Keerthana Reddy,
3. Eragamreddy Sreedeepthi Reddy.

All are at Hyderabad. **...Plaintiffs**

Vs

Sithalam Hari Krishna Reddy, father's name known,Aged about 52 years, Beside D.No.9/268, Nabikota, Kadapa City and District. **... Defendant**

NOTICE TO DEFENDANT

Where as the above plaintiffs filed the above suit against you for Permanent injunction relating to the House vacant site in dilapidated house New D.No.9/268, 9/268-1(new D.No.52/268-1), D.No. 9/268-1(new D.No.52/268-2) and NewD.No.9/268-3 with upstairs, situated in Nabikota, Chemmumia peta and above suit is posted 03/01/2023 for your appearance before the IInd Additional Junior Civil Judge, Kadapa at 10.30 A.M., failing which the matter will be decided ex-parte.

L.RAMA SAJEEVA REDDY
Advocate For Petitioner/Plaintiff, KADAPA.

మహారాజశ్రీ కడప ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.NO. 234/2019
R.C.C.NO. 8/1988

సయ్యద్ మహబూబ్ బీడైడు వారి వారసులు
1. సయ్యద్‌సాహెబ్ జాన్ మరియు 9 మంది ఇతరులు **...డిక్రీ హోల్డర్సు**

మరియు

ఆర్6. పటాన్ సర్‌వర్‌ఖాన్, తండ్రి లేటు పటాన్ హమిద్ ఖాన్, డోర్‌నెంబరు: 20/390-డి3, మరియు 20/390-డి6, రమేష్‌హాల్ ఎదురుగా, కడప. **...రెస్పాండెంటు నెం.6.**

నోటీసు

డిక్రీ హోల్డర్లు, మీ పైన మరియు ఇతరుల పైన మిమ్ములను E.P. షెడ్యూలు ఆస్థి నుండి ఖాళీ చేయించి, డిక్రీ హోల్డరుకు స్వాధీనము చేయవలసినదిగా పై కేసు దాఖలు చేసివున్నారు. పై కేసు 27-1-2023న మీ యొక్క హాజరుకు గాను వాయిదా వుంటున్నది. ఏవైనా మీరు 27-1-2023వ తారీకున ఉదయం 10.30 గంIIలకు పై కోర్టు నందు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరుచుకొనవలెను. లేనిచో రాజశ్రీ కోర్టు వారు మీకు పరోక్షముగా తీర్మానించెదరు.

టి.రామలింగేశ్వరరాజు
అడ్వకేటు, కడప.

ఇవ్వాల్సింది కొండంత.. ఇచ్చింది గోరంత

- మాజీ ఎంపీ డాక్టర్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సింది కొండంత అయితే ఇచ్చింది గోరంతని మాజీ ఎంపీ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా నాడు కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్ర ప్రదేశ్‌కు మూడు వరాలు ఇచ్చిందని తులసిరెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదా ముగిసిన అధ్యాయమని చెప్పి మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద కేంద్రం రాయలసీమకు, ఉత్తరాంధ్రకు ప్యాకేజీ కింద రూ.24,350 కోట్ల ఇవ్వాల్సి ఉండగా, పిల్లికి బిచ్చం వేసినట్లు కేవలం రూ.1,750 కోట్లు మాత్రమే ఇచ్చిందని విమర్శించారు. విభజన చట్టంలోని 108 సెక్షన్ 13 షెడ్యూల్ కింద కేంద్రం రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లు ఇవ్వాలని తెలిపారు. ఎంగిలి మెతుకులు విదిల్చినట్లు రూ.21,360 కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసిపికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని నిలదీసి సాధించుకునే దమ్ము లేదన్నారు. సీమాంధ్ర స్వర్ణాంధ్ర కావాలంటే, రాష్ట్రాభివృద్ధి జరగాలంటే ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని తులసిరెడ్డి పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతకు విద్యార్థులు కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పరిసరాల శుభ్రతకు విద్యార్థులు కృషి చేయాలని ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఓబుల్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను తొలగించారు. మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. కాగితాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ఒక చోట వేయాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రమణయ్య, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలకు గుంతలు తీస్తున్న విద్యార్థులు

కుల గణాంకాల ప్రకారం రిజర్వేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కుల గణాంకాలా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని ఎంపి ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఆ మేరకు సోమవారం ఎంఆర్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు సహదేవుడు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంట్లో ఆమోదం తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసి, రిజర్వేషన్లు 80 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఎస్‌సి మాదిగ ఉపకులాలకు చెందిన భూమిలేని నిరుపేదలకు అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మూడెకరాల భూమి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య, రామాంజనేయులు, ముత్తయ్య, నరసింహులు, రాముడు, రమణయ్య, ఓబన్న పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

మురుగునీరు రోడ్లపైకొస్తే కేసులు

ప్రజాశక్తి - కొండాపురం

ఇళ్లలోని మురుగునీరు, స్నానపు నీరు రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు. పట్టణంతోపాటు గ్రామాల్లో వ్యర్థ నీటిని రోడ్ల మీదికి వదలడం వల్ల ప్రజా రవాణాకు ఆటంకం కలుగుతోందన్నారు. అంతేకాక అనేక రోగాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు మురుగు నీటి గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎస్ఐ వివరించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

లక్ష్మిరెడ్డి మృతదేహం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని కోతి సమాధి సమీపంలో కోట్ల లక్ష్మిరెడ్డి (45) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం ఉదయం పార్నపల్లి రోడ్డు మీదగా వెళుతున్న కొంతమంది కోతి సమాధి సమీపంలో ఓ వ్యక్తి పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృత దేహాన్ని పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. లింగాల మండలం కోమనూతల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి, సమాచారమిచ్చామని పోలీసులు తెలిపారు. మృతుడి భార్య సులోచన ఫిర్యాదు మేరకు ఎస్ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

PASSPORT MISSING

I, SYED MUNTAZ W/o. SYED DATAGIRI, residing at D.No. 6/745-5, Ghouse Nagar, Kadapa, Y.S.R.Dist., Andhra Pradesh- 516001. I am the holder of Indian Passport Bearing No:U3255935. The said Passport was lost by me while I was going to Xerox Shop for making Xerox copies of Passport at Ganjikunta Colony, Kadapa on 25/11/2022.

IN THE COURT OF THE HON'BLE VII ADDL. DISTRICT JUDGE :CUM : MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL : : KURNOOL.

M.V.O.P. No. 113 / 2022.

G. Boya Ramasubbamma 2 Others ... Petitioners

-Vs-

M. Siva Bharath Reddy 3 Others ... Respondents

Respondent No.1

1.M. Siva Bharath Reddy,
S/o M. Sekhar Reddy,Major Transferer and Insured/ owner of the vehicle, R/o. H.No. 4/94, Ramnapalle, Chennur Mandal, Cuddapah.516162

Where as the petitioners has filed said case against you for compensation under M.V. Act. If you have any objections for the same may appear either in person or through advocate on 28 -12 -2022 at 10-30 A.M. before the said court, failing which the matter will be decided in your absence.

By the order of the Hon'ble Court,

Dated 28-12-2022

Sri. M.L. Srinivasa Reddy
Advocate for Petitioners